### కొనసాగుతున్న ఎన్నికల సంఘం

# నియమ నిబంధనల ఉల్లంఘనలు

**పోటీలుపడీ విపరీతంగా ఖర్చు పెడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ● కొందరు ఖర్చు పెట్టలేక వెనుకడుగు వేస్తున్నారు**



హైదరాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయం విషయంలో ఎన్నికల సంఘం నియమ నిబంధనల ఉల్లంఘనలు కొనసాగుతూనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచార ఖర్చు అంతకంతకు పెరిగిపోతుండడంతో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఒక్కో అభ్యర్థి మొత్తం ప్రచార ఖర్చు రూ.40లక్షలలోపే ఉండాలి, కాని ఆ ఖర్చు కొందరు అభ్యర్థులకు ఒక్కో రోజుకు కూడా చాలని పరిస్థితి ఏర్పడుతోంది. ఫలితంగా రోజువారీ అభ్యర్థుల ప్రచార వ్యయం రూ.20లక్షల నుంచి రూ.50లక్షల వరకూ ఉంటోంది. ప్రాంతం, పోటీని బట్టి ఖర్చు కూడా మారుతుండడంతో జనరల్ స్థానాల్లో ఆ ఖర్చు కాస్తా ఎక్కువవుతుండగా, ఎస్సీ,ఎస్టీ రిజర్వ్ డ్ స్థానాల్లో ఒకింత తక్కువగా ఉంటోంది. పోలింగ్ తేదీకి ఒకటి రెండు రోజుల ముందు ఓటర్లకు చేసే డబ్బు పంపిణీ ఖర్చు దీనికి అదనం. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకూ అభ్యర్థులను ఏదో ఒక ఖర్చు వెంటాడు తూనే ఉంటుండడగా ప్రచారానికి సంబంధించి ముఖ్యంగా ఎన్నికల రథం, దానికి డీజే సౌండ్ బాక్స్ లు, పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు, ఫ్లెక్సీ లకు తప్పనిసరిగా ఖర్చుపెట్టాలి. అలాగే ర్యాలీలు నిర్వహిస్తూ ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లకు అయ్యే పెట్రోల్, డీజీల్ వ్యయాన్ని భరించాలి. వీటికే రోజుకు సగటున రూ.10లక్షల నుంచి రూ.15లక్షల దాకా ఖర్చు పెడుతున్నట్లు సమాచారం. ఇది కాకుండా నిత్యం తమతో ప్రచారానికి వచ్చేవారికి చెల్లించాల్సిన సొమ్ము మనిషికి సగటున రోజుకు రూ.200–రూ.500 దాకా చెల్లిస్తున్నారు. పెద్దగా ఖర్చు పెట్టని ఎంఐ ఎం లాంటి పార్టీకి సైతం ఇలాంటి పరిస్థితి రావడం గమనార్హం. గతంలో పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహిస్తే డబ్బులివ్వకుండానే పెద్ద ఎత్తున జనం వచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండాపోయిందది. సభలు, సమావేశాలకు ప్రజలను తరలించడానికి రోజు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు పెడుతున్నారు. ఇదికాక రికార్డు స్థాయిలో ప్రచారం చేసేందుకు అయ్యే ఖర్చులను అభ్యర్థులు బూత్‌స్థాయి నేతలకు ఇస్తున్నారు. ఒక్కో వార్డుకు ఈ ఖరుచ దాదాపు రూ.10వేల దాకా ఉంటోందని సమాచారం. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో మాత్రం ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కో వార్డులో ప్రచారానికి సుమారు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు ఖర్చు చేస్తుండగా, అదే హైదరాబాద్ నగరంలో ఆ ఖర్చుతో సరిసమానంగా ఇక్కడి పార్టీలు కూడా పోటీలుపడి ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా అధికార పార్టీలకు చెందిన అభ్యర్థుల ఖర్చు మాత్రం రోజుకు రూ.20 నుంచి 25లక్షల వరకు ఉంటోంది. సాధారణంగా అభ్యర్థులు నగరంలో వివిధ ప్రాంతాలలలో ప్రచారానికి వచ్చిన సందర్భంలో నేతలు మాత్రం అంతా తామై వ్యవహరిస్తుండడం, ప్రచారానికయ్యే వ్యయాన్ని వారే భరించేవారు. కాని ఇప్పుడు ట్రెండ్‌మారి నేడు అభ్యర్థులే ఆ ఖర్చంతా అభ్యర్థులే భరిస్తున్నారు. మరో కథనం ప్రకారం ప్రధాన పార్టీల నుంచి టికెట్ పొందిన వారిలో కొందరు అభ్యర్థులు ఆర్థిక స్తోమత లేకపోవడంతో అధికార పార్టీ అభ్యర్థులు పెట్టే ఖర్చుతో సమానంగా పోటీగా ఖర్చు చేయలేకపోతున్నారు. టికెట్ వచ్చిందన్న సంతోషం కంటే, రోజువారీ ఖర్చుతో ఆ అభ్యర్థి ఖర్చు ఎలాగైనా భరించడానికి ముందుకు దూకి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

హైదరాబాద్ వార్త



## యాకుత్‌పురలో గెలుపుపై ధీమాలో ఉన్న
# ఎంఐఎం, బిఆర్ఎస్, బిజెపి, ఎంబిటి, కాంగ్రెస్



బిఆర్ఎస్ - సామ సుందర్‌రెడ్డి



ఎంఐఎం - జాఫర్ హుస్సేన్ మెహరాజ్



కాంగ్రెస్ - కె.రవిరాజు



బిజెపి - వీరేందర్ బాబు

యాకుత్‌పుర, నవంబరు 21 ప్రభాతవార్త : హైదరాబాద్ జిల్లా యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గానికి ఎంతో ప్రత్యేకత ఉంది. నియోజకవర్గంలో ఎక్కువ శాతం పేద ప్రజలు ఉన్నారు.1957లో యాకుత్‌పుర నియోజకవర్గం ఏర్పడింది.2018 వరకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో యాకుత్‌పుర నియోజకవర్గం ఎంఐఎంకు కంచుకోటగా నిలిచింది.యాకుత్‌పుర నియోజకవర్గంలో ఉన్న ఏడు డివిజన్‌లలో గౌలిపుర,ఐఎస్ సదన్ డివిజన్‌లలో బిజెపి కార్పొరేటర్లు జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలు పొందగా,కుర్మగూడ,డబీర్‌పుర, రెయిన్‌బజార్,సం తోష్‌నగర్, తలాబ్‌చంచలం డివిజన్లలో ఎంఐఎం కార్పొరేటర్లు విజయం సాధించారు.2018లో జరిగిన ఎన్నికల్లో ఎంఐఎం అభ ర్యర్థికి సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రికి 69,595 ఓట్లు,వచ్చి విజయం సాధించగా బిఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్ రెడ్డికి 22,617 ఓట్లు,ఎంబిటి అభ్యర్థి మాజీదుల్లాఖాన్‌కు 21,222 ఓట్లు,బిజెపి అభ్యర్థి సిహెచ్ రూప్‌రాజ్‌కు 16,608 ఓట్లు,కాంగ్రెస్ అభ్యర్థి కె.రాజేందర్ రాజుకు 6452 ఓట్లు లభించాయి.2018 ఎన్నికల్లో ఇక్కడ ఎమ్మెల్యేగా గెలు పొందిన సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రికి పార్టీ అధిష్టానం టిక్కెట్ ఇవ్వలేదు.ఆయన స్థానంలో నాంపల్లి నియోజకవర్గం నుంచి 2014,2018 ఎన్నికల్లో రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన జాఫర్ హుస్సేన్ మెహరాజ్‌ను ఎంఐఎం పార్టీ యాకుత్‌పుర నియోజకవర్గం బరిలోకి దింపింది.యాకుత్‌పుర నియోజకవర్గంలో ఎంఐఎంకు మంచి పట్టు ఉంది.ఎంఐఎం పార్టీ విజయం కోసం అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మెహరాజ్‌తో పాటు నాయకులు తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు.ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ప్రత్యేకంగా యాకుత్‌పుర నియోజకవర్గం దృష్టి పెట్టి పార్టీ గెలుపు కోసం ప్రచారంలో పాల్గొంటున్నారు.బిఆర్ఎస్ తరుపున 2018లో పోటీ చేసిన సామ సుందర్‌రెడ్డి రెండవ సారి యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మళ్లీ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో సామ సుందర్ రెడ్డికి 22,617 ఓట్లు లభించాయి.బిఆర్ఎస్ పార్టీకి 2018లో జరిగిన ఎన్నికల్లో రెండవ స్థానం దక్కింది. యాకుత్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే బిఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి జోరుగా నియోజకవర్గంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు గురించి నాయకులు ప్రజలకు వివరిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే 1993 నుంచి పార్టీ పటిష్టత కోసం పాటు పడుతున్న పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.రవి రాజు యాకుత్‌పుర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.జిహెచ్ఎంసి యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా,శాలిబండ డివిజన్,చాంద్రాయణగుట్ట నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేసిన బిసి కులానికి చెందిన రవిరాజ్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టిక్కెట్ ఇచ్చింది.నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులతో అభ్యర్థి రవిరాజు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.వినయ్‌నగర్‌కు చెందిన భాగ్యనగర్ జిల్లా బిజెపి అధికార ప్రతినిధిగా పని చేస్తున్న నక్క బోయిన వీరేందర్ బాబు (యాదవ్ కులం) బిజెపి తరుపున యాకుత్‌పుర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. నక్క బోయిన వీరేందర్ బాబు భాగ్యనగర్ జిల్లా బిజెపి అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు.నియోజకవర్గంలో గౌలిపుర,ఐఎస్ సదన్ డివిజన్లలో బిజెపి కార్పొరేట్లరు ఉండటంతో విజయం కోసం వీరేందర్ బాబు నియోజకవర్గం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.కేంద్రంలోని బిజెపి చేపట్టిన సంక్షేమ పథకాలు గురించి బిజెపి నాయకులు ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నారు.మాజీ కార్పొరేటర్ అమ్జాదుల్లాఖాన్ యాకుత్‌పుర నియోజకవర్గం నుంచి ఎంబిటి తరుపున పోటీలో ఉన్నారు.2018 ఎన్నికల్లో ఎంబిటి అభ్యర్థి మాజీదుల్లాఖాన్‌కు 21,222 లభించాయి. యాకుత్‌పుర నియోజకవర్గంలో 2,83,369 ఓట్లు ఉన్నాయి.ఎన్నికల పోలింగ్ గడువు సమీపిస్తుండటంతో యాకుత్‌పుర నియోజకవర్గంలో ఏఐఎంఐఎం,బిఆర్ఎస్, బిజెపి,కాంగ్రెస్, ఎంబిటి పార్టీలు గెలుపు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి.ఎన్నికల్లో ఎంఐఎం,బిఆర్ఎస్,బిజెపి, ఎంబిటి,కాంగ్రెస్ పార్టీలు గెలుస్తామనే ధీమాలో ఉన్నాయి.

**యాకుత్‌పుర నియోజకవర్గం నుంచి ఇంత వరకు శాసన సభ్యులుగా విజయం సాధించిన వారి పేర్లు**

| | | |
|---|---|---|
| 2018 | సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి | ఏఐఎంఐఎం |
| 2014 | ముంతాజ్ అహ్మద్ ఖాన్ | ఏఐఎంఐఎం |
| 2009 | ముంతాజ్ అహ్మద్ ఖాన్ | ఏఐఎంఐఎం |
| 1999 | ముంతాజ్ అహ్మద్ ఖాన్ | ఏఐఎంఐఎం |
| 1994 | ముంతాజ్ అహ్మద్ ఖాన్ | ఎంబిటి |
| 1989 | ఇబ్రహీం బిన్ అబ్దుల్లా మస్కతి | ఏఐఎంఐఎం |
| 1985 | ఇబ్రహీం బిన్ అబ్దుల్లా మస్కతి | ఇండిపెండిట్ |
| 1983 | ఖాజా అబు సయ్యద్ | ఇండిపెండిట్ |
| 1978 | భాక్రీ ఆగా | ఇండిపెండిట్ |




## ఉరివేసుకుని విద్యార్థి మృతి

తుర్కయాంజాల్, నవంబర్ 21 ప్రభాతవార్త: తుర్కయాంజాల్‌లోని న్యూ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో తన గదిలో జూనియర్ కళాశాల బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నందికాడి గ్రామం, అశ్వారావుపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఇంటర్ విద్యార్థి పద్మం ఫ్లెమింగ్ క్రిష్ తండ్రి శ్రీనివాస్ వయస్సు 17 సంవత్సరాలు న్యూ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్నాడు. భోజనాలకు వెళుతున్న సమయంలో విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి: ఎంపి లక్ష్మణ్



చిక్కడపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త: రాష్ట్రంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తామని బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. తెలం గాణ రజక దోభీ అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ రజక ప్రతినిధుల సదస్సు మంగళవారం బాగ్‌లిం గంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంస్థ చైర్మన్ నర్సింహ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ రజకులు రాజకీయంగా, ఆర్థికలంగా బలోపేతం కావాలన్నారు. రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చేందుకు ప్రధానమంత్రి మోదీతో చర్చించి సమస్యను పరిష్కరించానికి కృషి చేస్తామన్నారు. తెలంగాణ రజక దోభీ అభివృద్ధి సంస్థ చైర్మన్ నర్సింహ్ మాట్లాడుతఊూ దేశంలో రజకులు 18 రాష్ట్రాలలో ఎస్సీలుగా కొనసాగుతున్నారని, తెలంగాణ రాష్ట్రంలోనూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

## రచయిత జల్ది విద్యాధరరావు రచనలు అందరిని స్ఫూర్తిదాయకం

**ఆచార్య కొలకలూరి ఇనాక్**



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, చిత్రంలో రచయిత జల్ది విద్యాదరరావు తదితరులు

చిక్కడపల్లి నవంబరు 21ప్రభాతవార్త: రచయిత జల్ది విద్యాధరరావు రచనలు స్ఫూర్తివంతమైన రీతిలో అందరిని ఆలోచింపచేసే విధంగా ఉంటాయని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అభిప్రాయపడ్డారు. మంగళవారం విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జల్ది విద్యాధరరావు రచించిన 'తోటమాలి మాలిమి' కవితా సంపుటి ఆవిష్కరణ సభ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో విమల సాహితీ పురస్కారాలను ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ అందించి గౌరవించారు. సభాసామ్రాట్, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రముఖ వక్త, కవి, విశ్లేషకుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, ప్రముఖ కవి ప్రొఫెసర్ జీవి.రత్నాకర్, ప్రముఖ రచయిత్రి శైలజమిత్ర, ప్రముఖ కథారచయిత్రి రోహిణి, ప్రముఖ కవి పెద్దూరి వెంకటదాసు, కవయిత్రి మంజుల సూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా విమలసాహితీ జీవన సాఫల్య పురస్కారాలను ప్రొఫెసర్ పాల్వాయి విజయలక్ష్మి పండిట్, డాక్టర్ బండారుప్రసాదమూర్తి, ప్రొఫెసర్ ఆర్.దేవన్న, రామకవచం సాగర్, డాక్టర్ రమణ యశస్వి, తుల్లిమల్లి విల్సన్ సుధాకర్, గుడిపాటి వెంకట్, కలిమి శ్రీ, కోట్ల వేంకటేశ్వర్‌రెడ్డి, ఉమ్మడిసింగు రాఘవరావు(రఘుశ్రీ)లకు అందించారు. అదే విధంగావివిధ రంగాలకు చెందిన వారికి విమలసామితీ జాతీయ సాహిత్య పురస్కారాలను అందించారు. అంతకుముందు కళా తాటికొండ నిర్వహణలో కవిసమ్మేళనంలో కవులు వివిధ అంశాలపై తమ అమూల్యమైన కవితలను వినిపించారు.

## హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దిన ఘనత బిఆర్ఎస్‌దే

**శేరిలింగంపల్లి అభ్యర్థి అరెకపూడి గాంధీ**



బట్టలు ఇస్త్రీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ శేరిలింగంపల్లి అభ్యర్థి ఆరెకపూడి గాంధీ

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 21 ప్రభాతవార్త : హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదని, ముఖ్యంగా ఐటి రంగంలో తెలంగాణ ఐటి శాఖ మంత్రి కెటిఆర్ ముందుచూపుతో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తుందని శేరిలింగంపల్లి బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ అన్నారు. మంత్రి కెటిఆర్ కృషి కారణంగా నేడు ప్రపంచ దిగ్గజ ఐటి సంస్థలు మొత్తం హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు పోటీపడుతున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో స్థానిక కార్పొరేటర్ మాదవరం రోజాదేవి రంగారవుతో కలిసి రిక్షాపుల్లర్స్ కాలనీ, రామక్రిష్ణనగర్, వెంకటేశ్వరనగర్, మాధవరం నగర్, ఆల్విన్ కాలనీ ఫేస్ 1, కమలా ప్రసన్ననగర్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ధీనబంధు కాలనీ, ప్రగతినగర్, హనుమాన్ నగర్‌లలో ప్రచారం నిర్వహించారు. హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్, యూత్ కాలనీలకు చెందిన మోచీ సంఘం సభ్యులు బిఆర్ఎస్ నాయకులు అక్తర్ ఆద్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి గాంధీ ముఖ్యఅతిధిగా హాజరై పార్టీలో చేరిన వారిని గులాభి కండువాలతో ఆహ్వానించారు. అనంతరం అరెకపూడి గాంధీ మాట్లాడుతూ దిగ్గజ ఐటి సంస్థలు నగరంలో తమ కార్యాలయాలను ఏర్పాటు చేయడం కారణంగా ఇక్కడి యువతకు లక్షల్లో ఉద్యోగాలు లభిస్తుండగా, రాష్ట్ర ఆదాయం సైతం పెరుగుతుందన్నారు. గతకొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ నగరం దేశంలో ఉండేందుకు అత్యంత అనుకూలమైన నగరంగా బహుమతి గెలుచుకోవడం బిఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందన్నారు.

# లష్కర్‌లో విజయంపై ఎవరిధీమా వారిదే

**లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు**
**అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆశలు పెట్టుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి**
**6 వరాలపై నమ్మకంతో కాంగ్రెస్ అభ్యర్థి**
**బిసి సీఎం, ఎస్సీ వర్గీకరణతో ధీమాగా ఉన్న బీజేపీ అభ్యర్థి**




సికింద్రాబాద్, నవంబర్ 21 ప్రభాతవార్త : సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో పోటాపోటీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తు న్నారు. ఓటర్లను ఆకట్టుకోడానికి నానా తంటాలు పడుతున్నారు. జరిపిన అభివృద్ధి పేరుతో సిట్టింగ్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ విసృతంగా ప్రచారం జరుపుతున్నారు. మరోసారి తన సీటును కాపాడు కోవడం కోసం విశ్వప్రయత్నం చేస్తున్నారు. గాలిలో మేడలు కట్టి ప్రజలను మభ్యపెడుతోందని బీఆర్ఎస్‌ను విమర్శిస్తూ కాంగ్రెస్, బీజేపీలు గళాన్ని వినిపిస్తున్నాయి. ఒకప్పుడు కాంగ్రె స్ కంచుకోటగా ఉన్న సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని టీడీపీ, బీఆర్ఎస్‌లు తమ అడ్డాగా మార్చుకున్నాయి. ప్రస్తుతం టీడీపీ పోటీలో లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి సికింద్రాబాద్ కైవసం చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతోంది. సికింద్రాబాద్ నియోజకవర్గంలో పాగా వేసేందుకు బీజేపీ అభ్యర్థి మేకల సారంపాణి గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి పీఆర్పీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి దాదాపుగా 20వేల ఓట్లు సాధించినప్పటికి ఓటమిపాలయ్యారు. ఎవరికి వారే సికింద్రాబాద్‌లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**విజయానికి కీలకంగా..** సికింద్రాబాద్ నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉన్నారు. వీరితో పాటు ముస్లింలు, క్రిస్టియన్‌లు కూడా అధికంగానే ఉన్నారు. మరీ ముఖ్యంగా తెలంగాణా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన వారు సికింద్రాబాద్ నియోజకవర్గంలో నివాసం ఉంటున్నారు. ఒకప్పుడు వలస కూలిగా, కూరగాయలు అమ్మేందుకు ఇతర వ్యాపారాలు చేఐసుకోడానిక వచ్చిన వారే అధికం. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులైన రైల్వే ఉద్యోగులే దాదాపు 30 వేల వరకు ఉంటారు. అంతే కాకుండా ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఉద్యోగులు కూడా అధికంగా ఉంటారు. వీరి సంఖ్య మాణికేశ్వరీనగర్‌లో అధికంగా ఉంటుంది. సికింద్రాబాద్ నియోజకవర్గంలో విజయం సాధించాలంటే బస్తీలలో పాటు రైల్వే ఉద్యోగుల ఓట్లు, క్రిస్టియన్, ముస్లిం ఓట్లు ఎంతో కీలకంగా మారనున్నాయి. వీరిని ప్రసన్నం చేసుకుంటే విజయం సాధించడం ఖాయమని భావిస్తుంటారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో మెట్టుగూడ, లాలాగూడ, శాంతినగర్, ఆలుగడ్డబావి, చిలకలగూడ ప్రాంతాల్లో రైల్వే ఓటర్లు అధికంగా ఉన్నారు. అలాగే మెట్టుగూడ, శాంతినగర్, లాలా గూడ, సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మహ్మద్‌గూడ, చిలకలగూడ, ఎల్‌నారాయణనగర్, వారాసిగూడ శ్రీనివాస్ నగర్ ప్రాంతాలలో ముస్లింలు అధికంగా ఉన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగులు మాణికేశ్వరీనగర్‌తో పాటు జామైఉస్మానియాకు దగ్గరలో అధికంగా ఉంటారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చి స్థిరపడ్డ వారు అడ్డగుట్ట, వారాసిగూడ, చిలకలగూడ, సీతాఫల్ మండిలలో అధికంగా ఉన్నారు. మెట్టుగూడ, విజయపురి, సీతాఫల్‌మండి, వారాసిగూడ, బౌద్ధనగర్‌లలో క్రిస్టియన్‌లు అధికంగా ఉన్నారు. సికింద్రాబాద్‌లో విజయం సాధించాలం టే వీరందరిని ప్రసన్నం చేసుకుంటారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 2లక్షల 62వేల 517 ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 1లక్షా 31వేల 776 మంది, మహిళా ఓటర్లు 1లక్షా 30వేల 716కాగా థర్డ్‌జెండర్‌లు 25 మంది ఉన్నారు. చేసిన అభివృద్ధిని చూసి సికింద్రాబాద్ ఓటర్లు తనకు పట్టం కడతారని, తాను మూడోసి తెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మారావు గౌడ్ ధీమాగా ఉన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యాక్రమాలు ఒకవైపు, తాను జరిపిన అభివృద్ధి మరోవైపు తన విజయానికి బాటలు వేస్తాయని నమ్ముతున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా సికింద్రాబాద్ టికెట్ ఆశిస్తూ బంగపడుతూ వస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆదం సంతోష్ గతంలో ఆయన భార్య ఆదం ఉమాదేవి మెట్టుగూడ, బౌద్ధనగర్ కార్పొరేటర్‌గా చేశారు. దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారు. తాను స్థానికుడినని, కాంగ్రెస్ పార్టీ కురిపించే వరాలు తన విజయానికి బాటలు వేస్తాయని ధీమాగా ఉన్నారు. కార్పొరేటర్‌గా తన భార్య రెండు పర్యాయాలు ప్రజలకు సేవలందించిన తీరు ఓటర్లను తమకు దగ్గర చేసిందని, తన విజయం నల్లేరుపై నడకేనని చెప్పుకుంటున్నారు. బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన మేకల సారం గపాణి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాడినని, నియోజకవర్గంలో ముదిరాజ్‌లు దాదాపు 60వేలకు పైగా ఉన్నారని తన విజయంపై ధీమాగా ఉన్నా రు. తమది క్రమిశిక్షణతో కూడిన పార్టీ అని, దీనికి తోడు బీజేపీ బిసి ముఖ్యమంత్రిని చేస్తానని ప్రకటించడంతో పాటు ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి కున్నందున తన విజయం సునాయ సమేనని భావిస్తున్నారు. కేవలం మెజారిటీ కోసమే ప్రయత్ని స్తున్నామని చెప్పుకుంటున్నారు. విజయంపై ఎవరిధీమా వారికే ఉంది. తామంటే తామే గెలుస్తామని ప్రచారం జరుపుకుంటున్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్



బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి



కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్

# ఉప్పల్‌లో బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం : బిఎల్ఆర్



సీనియర్ సిటిజన్ల సమావేశంలో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు



లక్ష్మారెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న శ్రీనివాసకాలనీ అసోసియేషన్ నేతలు

**ఉప్పల్, కుషాయిగూడ, నాచారం, నవంబరు 21 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ సూర్యనగర్ కమ్యూనిటిహాల్‌లో గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశంలోఆయన పాల్గొని మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. సిఎంకెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల తర్వాత సీనియర్ సిటిజన్ల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో ప్రజలు బిఆర్ఎస్ ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల హనుమంతరెడ్డి, మేకల మధు, రాజవర్ధన్‌గుప్త, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నేతలు జెట్ట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీనివాస అసోసియేషన్ కాలనీ నేతల మద్దతు...** మీర్‌పేట శ్రీనివాసకాలనీ అసోసియేషన్ నేతలను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, బిఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస కాలనీ నేతలు బండారి లక్ష్మారెడ్డికి మద్దతు ప్రకటించారు.

**బేతాళ బాలరాజ్ ఆధ్వర్యంలో...** ఎన్నికలప్రచారంలో భాగంగా కాప్రా సర్కిల్ పరిధిలోని కమలానగర్, మహేష్‌నగర్, ఈసీఐఎల్ ప్రాంతాల్లో తెలంగాణ ఉద్యమనేత బేతాళ బాలరాజ్ ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం ముమ్మరంగా నిర్వహించి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాలా జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**పార్టీలో చేరికలు...** నాచారం డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వీరాంజనేయులు బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ ఆధ్వర్యంలో బీఎల్ఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ వీరాంజయనేయులును పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం బీఎల్ఆర్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికోసం బిఆర్ఎస్ మద్దతు తెలుపాలని కోరారు.

# అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించండి : సుధీర్‌రెడ్డి



కార్తీకమాస వనభోజన మహోత్సవంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి



ఎల్బీనగర్ పద్మశాలి సంఘం కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవిరెడ్డి

**హయత్‌నగర్, వనస్థలిపురం, నవంబర్ 21 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లోని లెక్చరర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారి కార్తీకమాస వనభోజన మహోత్సవం మంగళవారం ఆటోనగర్‌లోని హరిణవనస్థలిలో ఘనంగా జరిగింది. వనభోజన మహోత్స వానికి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. కార్యక్రమానికి హాజరైన సుధీర్‌రెడ్డి, ఆయన సతీమణి కమల మాట్లాడుతూ... కార్తీక మాసం మహిళలకు ఎంతో ప్రత్యేకమైనదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్నో చర్యలు తీసుకుంటోందని ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి ఎల్.బి.నగర్‌లో గులాబీ జెండాను ఎగురవేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు సింగిరెడ్డి మల్లీశ్వరి, కొసనం ధనలక్ష్మి పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి, పార్టీ డివిజన్ కమిటీ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్‌లు డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న సుధీర్‌రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. అదే విధంగా హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సుభద్ర నగర్ కాలనీవాసుల ఆహ్వానంమేరకు కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సుధీర్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుని వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

**పద్మశాలి సంఘాల మద్దతు...** ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, అదే విధంగా చేనేత, కార్మిక సహకార సంఘాల వారికి ఎన్నో రకాల అభివృద్ధిఫలాలు అందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని దృష్టిలో ఉంచుకుని పద్మశాలి కుటుంబసభ్యులందరూ ఏకమై వచ్చే ఎన్నికల్లో వారిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో చిప్ప ప్రభాకర్, బురుగు తులసిదాస్,రాపోల్ సుధాకర్, ఉమాశ్రీనివాస్, రమాదేవి, సుధాకర్, చెరుకు స్వామి, రుద్ర యాదగిరి,రుషి, కస్తూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలను ప్రజలు విశ్వసించాలి : కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



ప్రచారంలో ఆరు గ్యారంటీలను వివరిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కెఎల్ఆర్



పార్టీలో చేరిన జల్‌పల్లి కౌన్సిలర్ రాధికకు కండువా వేస్తున్న కెఎల్ఆర్

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన సోనియాగాంధీ తెలంగాణ ప్రజల కోసం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు విశ్వసించి కాంగ్రెస్‌కే ఓటు వేయాలని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించి పాదయాత్రలు, రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రచారంలో సోనియా ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఒక్కొక్కటి తెలియజేస్తూ ఓటర్లకు అర్థమయ్యేటట్లు వివరించారు. అభివృద్ధి అంటే దేశంలోగానీ రాష్ట్రంలోగానీ కాంగ్రెస్‌తోనే మొదలయ్యిందనీ ఆయన వెల్లడించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ఘన చరిత్ర గలది కాంగ్రెస్ పార్టీయేననీ అట్టిపార్టీ పేదల సంక్షేమంకోసం దేశ అభివృద్ధి కోసం పాటుపడిందని ఆయన వివరించారు. తెలంగాణరాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందనీ కెసిఆర్ కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆయన అన్నారు. నాడు ఇందిరా గాంధీ పేదలకు ఇచ్చిన భూములను నేటి పాలకులు కాజేశారని ఆయన ఆరోపించారు. ఈ ఎన్నికలు బిఆర్ఎస్ పాలనకు చరమ గీతం పాడుతాయనీ ప్రజలు కెసిఆర్ కుటుంబాన్ని తరిమికొడతారని అన్నారు. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేననీ మహేశ్వరం నియోజకవర్గం నుండి తనను గెలిపిస్తే ఇక్కడి ప్రజలందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అమలయ్యేలా చూస్తానని కెఎల్ఆర్ స్పష్టం చేశారు.

**కాంగ్రెస్‌లో జల్‌పల్లి కౌన్సిలర్ చేరిక**

కాగా జల్‌పల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డుకు చెందిన కౌన్సిలర్ జింకల రాధిక శ్రవణ్ కాంగ్రెస్‌లో చేరారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆమె ఎంఐఎం అభ్యర్థిగా పోటీ చేసి ప్రత్యర్థి బిఆర్ఎస్ పార్టీపై 187 ఓట్ల మెజార్టీతో గెలిచిన ఆమె మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన రాధికకు కాంగ్రెస్ కండువా వేసి ఆహ్వానించారు.

# బిఆర్ఎస్ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి : మర్రి రాజశేఖర్‌రెడ్డి



పాదయాత్ర చేస్తూ కాలనీలలో ప్రచారం నిర్వహిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

**మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, నవంబర్ 21 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గంలోని మల్కాజిగిరి, గౌతమ్‌నగర్, గోపాల్‌నగర్, ఈస్ట్‌ఆనంద్‌బాగ్ డివిజన్లలో నిర్వహించిన ప్రచారంలో ఎన్నికల ఇంచార్జ్ ఆర్.జితేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్‌ల ఆధ్వర్యంలో పలు కాలనీలలో మల్కాజిగిరి బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరుగుతూ జోరుగా ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన ప్రజలు బిఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారు. కాలనీలలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. సిఎం కెసిఆర్, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ల సహకారంతో వందలాది కోట్ల నిధులతో ఇక్కడి ప్రాంతాల్లో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపెట్టారని ఆయన పేర్కొన్నారు. గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ ఎన్నికల ఇంఛార్జి జితేందర్‌రెడ్డి నేతృత్వంలో హిల్‌టాప్ కాలనీ, ఇందిరా నెహ్రూనగర్, జ్యోతినగర్ తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారుగుర్తుకు ఓటువేసి బిఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.సూర్యనారాయణరెడ్డి, ఆకుల నరసింహారావు, వీరేశం యాదవ్, కృష్ణగౌడ్, సురేష్‌యాదవ్, రాముయాదవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే కేటీఆర్ నిరుద్యోగుల జపం : సామ రంగారెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సామ రంగారెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, నవంబర్ 21 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే తొమ్మిదేళ్లలో గుర్తుకురాని నిరుద్యోగులు బిఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు గుర్తుకొచ్చారని ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి మండిపడ్డారు. మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఏవీయన్‌రెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితోకలసి సామ రంగారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు హాలీవుడ్ నటులను మించిన స్థాయిలో బీఆర్ఎస్ నాయకులు అనేక డ్రామాలాడతారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ యువతను నిర్వీర్యం చేసిందన్నారు. ఇనాళ్లు గుర్తుకు రాని జాబ్ క్యాలెండర్ ఇప్పుడు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామని కేసీఆర్ పేర్కొనడం బీఆర్ఎస్ ప్రభుత్వం అవకతవకలకు పాల్పడిందనడానికి నిదర్శనమన్నారు. పేపర్‌లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలను నట్టేట ముంచిన కేటీఆర్ నంగనాచి మాటలను నిరుద్యోగులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 2018 ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీలనే నెరవేర్చని కేసీఆర్ ప్రభుత్వం 2023 మ్యానిఫెస్టోను నమ్మేపరిస్థితిలో లేరని, ఓట్లకొరకు వచ్చే బీఆర్ఎస్ నాయకులను ప్రజలు నిలదీయాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని డ్రామాలాడినా, వారికి ఓటుతో బుద్ధి చెప్పి ఇంటికి పంపించాలనే స్థిర నిశ్చయంతో ఎల్‌బీనగర్ ప్రజలు ఉన్నారన్నారు.జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎల్‌బీనగర్ ప్రజలు ఇచ్చిన తీర్పు మళ్లీ పునరావృతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ నాయకులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓట్లు అడిగే హక్కు నాకే ఉంది : సబితా ఇంద్రారెడ్డి



రోడ్ షోలో ప్రసంగిస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ ప్రజలను స్వంత కుటుంబ సభ్యులుగా భావించి వారి సంక్షేమానికి.. వారు నివసిస్తున్న ప్రాంతాల అభివృద్ధికి అహోరాత్రులు కృషి చేసిన తనకే ఈ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఉందని నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ కాలనీల్లో రోడ్ షోలు నిర్వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చుట్టపు చూపుగా వస్తున్న ప్రతిపక్ష పార్టీల వారిని ప్రజలు నమ్మవద్దనీ వారికి ఓటు అడిగే అర్హతే లేదని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందనీ ఇక్కడి ప్రజలతో మమేకమై పని చేస్తున్న తాను వందలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశానని ఆమె వివరించారు. సిఎం కెసిఆర్, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌ల సహకారంతో వందలాది కోట్ల నిధులు తెచ్చి ఇక్కడి ప్రాంతాల్లో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపెట్టానని ఆమె పేర్కొన్నారు. తాను చేయించిన రహదారుల విస్తరణ, చెరువుల సుందరీకరణ, ట్రంక్‌లైన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, ప్రజలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాళ్లు, పబ్లిక్ ప్లే గ్రౌండ్‌లు, ఆసుపత్రులు, గ్రంథాలయాలు, ప్రజా భవన్‌లు చూస్తే ఎవరికైనా తాను ఎంత మేర అభివృద్ధి చేశానో అర్థమవుతుందని ఆమె స్పష్టం చేశారు. అదే విధంగా ఇంటింటికి అర్హులకు అందించిన సంక్షేమ ఫలాలను కూడా ఆమె వివరించారు. తాను చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిపక్షాల వారు చేయలేరని ఆమె అన్నారు. తన సేవలను గుర్తించి ఈ ఎన్నికల్లో తనను గెలిపించి అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించుకోవాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

**అభివృద్ధి ప్రదాతను గెలిపించుకోవాలి: కార్తీక్‌రెడ్డి...** ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే నాయకురాలు సబితమ్మను మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు గెలిపించుకోవాలని బిఆర్ఎస్ జాతీయ మీడియా అధికార ప్రతినిధి పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ ప్యాట నర్సింహ పార్టీకి రాజీనామా చేసి కార్తీక్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గులాబి కండువా వేసి ఆహ్వానించిన కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ అహర్నిషలు నియోజకవర్గ అభివృద్ధికి అలుపెరుగకుండా పని చేసే నాయకురాలు కేవలం సబితమ్మేననీ ఆమెకు ఈ ఎన్నికల సమయంలో అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గంలో ఇంటింటికి సుపరిచితురాలైన సబితమ్మను ప్రజలు ఆశీర్వదిస్తారనే నమ్మకం తమకు ఉందని కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు.

# మహేశ్వరం నియోజకవర్గ బిజెపి అభ్యర్థి అందెలకు లక్ష్మీనగర్ కాలనీవాసుల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

**ఎల్‌బినగర్, నవంబరు 21 ప్రభాతవార్త :** మహేశ్వరం నియోజకవర్గంలో కాషాయం జెండా ఎగరవేసి బిజెపి సత్తాచాటుతామని మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఎమ్మె ల్యే అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్ పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీలో మంగళవారం బిజెపి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగి శ్రీరాములు యాదవ్ బిజెపిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభ్యున్నతి సాధిస్తుందని అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు బిజెపికి అవకాశం ఇస్తే డబల్ ఇంజన్ సర్కారు నడిపిస్తామన్నారు. అవినీతి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను తరిమికొట్టాలని విజ్ఞప్తి చేశారు. శ్రీరాములు యాదవ్‌కు లక్ష్మీనగర్ కాలనీ వాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై టిఆర్ఎస్ ప్రభుత్వం పై ప్రజలకు విశ్వాసం పోయిందని తెలంగాణ ప్రజలు బిజెపి వైపు ఎదురుచూస్తున్నారని అన్నారు. కెసిఆర్ కుటుంబం అవినీతి అక్రమాలపై తెలంగాణ ప్రజలు ఓటు ద్వారా తిరగబడతారని అన్నారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవినీతికి వ్యతిరేకంగా పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబం తెలంగాణ సంపదను పూర్తిగా దోచుకుందన్నారు. గత రెండు ఎన్నికలలో కేసీఆర్ ఇచ్చిన ఒక్క హామీని నిలబెట్టుకోలేదని బంగారు తెలంగాణ పేరిట కెసిఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని అన్నారు. దళితులను గిరిజనులను నిరుద్యోగులను యువతను, మహిళలను, విద్యార్థులను కెసిఆర్ తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని శ్రీరాములు యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను నమ్మితే ఇక అధోగతేనని అన్నారు. తాను మాట తప్పను పార్టీ మారననీ తనను విశ్వసించి ఓటు వేసి గెలిపిస్తే పారదర్శకంగా పని చేస్తానని అందెల స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నిజాయితీతో నిర్భయంగా పని చేసి సుపరిపాలన అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరుట్ల సురేష్, బాపురెడ్డి, మందుల శ్రీధర్‌రాజ్, విటల్, ప్రవీణ్, సురేష్‌ముదిరాజ్, శివకుమార్,గుండు బిక్షపతి, చక్రాల వెంకటేష్, అనిల్‌కుమార్, ఋషి మురళీ మోహన్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసచారి, సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్, చిన్నయ్య పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా కార్తీక మాస ఉత్సవాలు

**ఎల్‌బినగర్, నవంబరు 21 ప్రభాతవార్త :** కొత్తపేట మారుతినగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి శ్రీ రాజరాజేశ్వరి శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో ఈనెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీకమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ సభ్యులు తెలిపారు. గత 8 రోజులుగా దేవాలయంలో కార్తీకమాసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఏకాదశ రుద్రాభిషేకాలు సత్యనారాయణ స్వామి వ్రతం జ్వాలాతోరణం మహాలింగార్చన లక్ష బిల్వార్చన సామూహిక కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం శుద్ధ నవమి సందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు.

# ఎల్బీనగర్ నా గడ్డ - ఇది కాంగ్రెస్ అడ్డా : కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

**ఎల్‌బినగర్, నవంబరు 21 ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికలలో ఎల్బీనగర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తు మూడో నెంబర్‌పై ఓటు గుద్దితే బిజెపి బీఆర్ఎస్ ముక్కులు పగలరని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మధు యాష్కీగౌడ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ జైపూర్‌కాలనీలో మంగళవారం సాయంత్రం స్ట్రీట్‌కార్నర్ మీటింగ్లో పాల్గొన్న మధుయాష్కీగౌడ్ సమావేశానికి పెద్దఎత్తున జనాలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగోల్, కొత్తపేట మూసి పరివాహక ప్రాంతంలో మహిళల బంగారు పుస్తెలు నల్లబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉరకడానికి కాదు ఉడికించడానికి వచ్చానన్నారు. పారిపోయేటోన్ని కాదు అవినీతిపరులను తరిమి కొట్టేవాన్నని, ఎల్బీనగర్ నాగడ్డ, ఇది కాంగ్రెస్ అడ్డ అన్నారు. ఆత్మగౌరవాన్ని అమ్ముకునే వ్యక్తులు ప్రజలకి ఏం చేస్తారని ప్రశ్నించారు. తెరాసకు గ్యారెంటీ లేకనే బిఆర్ఎస్ పేరుతో వచ్చారని ఎద్దేవ చేశారు. బీజేపీ, బిఆర్ఎస్ కలిపి ఓట్లు చీల్చే కుట్ర చేస్తున్నారని, తల్లి సోనియా ఇచ్చినా ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జ్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు శాలిని, బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాస సురేష్, కార్పొరేటర్ దర్పల్లీ రాజశేఖర్‌రెడ్డి, జాతీయ సిపిఐ నాయకులు శేకర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, నాగోల్ రాములు, సహు రమణ, భవాని, దేరం గుల కృష్ణ, దాస్ సురేష్, రాజ్‌కిరణ్, చిరంజీవి, జితేందర్, మంజుల రెడ్డి, నర్సింహ, సుధాకర్ పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలను వివరిస్తూ మల్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం



పెద్దఅంబర్‌పేటలో ఎన్నికల ప్రచారంలో మల్‌రెడ్డి రాంరెడ్డి



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

**హయత్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డి, పార్టీ పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ మాజీ వైస్‌ఛైర్మన్ సిద్దంకి కృష్ణారెడ్డిలు పెద్దఅంబర్‌పేటలో ఆయా వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో పాటు మ్యానిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పెద్దఅంబర్‌పేటలో దశాబ్దానికి పైగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే హస్తం గుర్తుకు ఓటువేసి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని కోరారు. 5వవార్డులో బొర్ర అనురాధసురేష్, 6వ వార్డులో పసుల రాజేందర్, 8వ వార్డులో పండుగుల జయశ్రీరాజు, 9వ వార్డులో చల్లూరి మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రచారాన్ని కొనసాగించారు. కుంట్లూర్‌లో వైస్‌ఛైర్‌పర్సన్ చామసంపూర్ణారెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు జోర్క గీతశ్రీరాములు,ఒరుగంటి సుజాత, అనుపమ సుప్రసేనారెడ్డిలు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గంట లక్ష్మారెడ్డి, దండెం రాజశేఖర్ రెడ్డి, గంటశ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఖలీల్ పాల్గొన్నారు.

# హార్డ్‌వేర్ పార్కు బాధితులకు న్యాయం : మేయర్ చిగిరింత పారిజాత



హార్డ్‌వేర్ పార్కు వ్యతిరేక జెఏసి సమావేశంలో మాట్లాడుతున్న పారిజాత

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** ఈ ఎన్నికల తర్వాత ఏర్పాటయ్యే కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా హార్డ్‌వేర్ పార్కు బాధితులకు న్యాయం జరిగేటట్లు చూస్తామని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. నాదర్‌గుల్‌లోని బద్దం మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం హార్డ్‌వేర్ పార్కు వ్యతిరేక పోరాట జెఏసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హార్డ్‌వేర్ పార్కు వల్ల ఇబ్బందులకు గురవుతున్న ప్లాట్లు, భూముల యజమానులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కందాడి శ్రీరాంరెడ్డి, జెఏసి ఛైర్మన్ రామేశ్వర రావు, దార సత్యం, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామారావు, రవికాంత్, సత్యనారాయణ, బాధిత రైతులు, ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

# మొదటి సారిగా బ్యాలెట్ పద్ధతిలో తెలంగాణ ఎక్స్ సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికైన తెలంగాణ ఎక్స్ సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**మన్సూరాబాద్, నవంబర్ 21 ప్రభాతవార్త:** తెలంగాణ ఎక్స్ సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బి, అస్సాం రైఫిల్స్) మొదటి సారిగా తెలంగాణ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరిపారు. ఈ ఎన్నికలు ఎల్‌బినగర్‌లోని శివగంగ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాజీ సిఏపిఎఫ్ సభ్యులు ఈ ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా భగవంత్, అసిస్టెంట్ కమాండెంట్ సిఏపిఎఫ్ విధులు నిర్వహించారు. ఐ.శ్యామ్‌సుందర్‌రెడ్డి సిఐఎస్ఎఫ్ అధ్యక్షులుగా, మామిళ్ళ రాజు, సిఆర్‌పిఎఫ్ జనరల్ సెక్రెటరీగా, ఓ.వెంకట్ రెడ్డి బిఎస్ఎఫ్ కోశాధికారిగా, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు మాజీ సిఏపిఎఫ్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.